క్లుప్తంగా

ఈవీఎం వినియోగంపై శిక్షణ



పొన్నూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మీకుమారి ఆదేశాల మేరకు పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని సెక్టార్, రూట్ అధికారులకు ఈవీఎం వినియోగంపై మాస్టర్ ట్రైనర్లతో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సమయంలో ఈవీఎంలు మరమ్మతులకు గురైతే.. ఎలా వ్యవహరించాలనే అనే అంశాలపై శిక్షణనిచ్చారు. 12 బూత్‌లకు ఒక రూట్ అధికారి ఉండనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నారాయణ సింగ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



గుంటూరు రూరల్: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీకర్ సోమవారం పరిశీలించారు. జొన్నలగడ్డలోని 25 నుంచి 29వ పోలింగ్ కేంద్రం వరకు, గోరంట్ల గ్రామంలోని 37, 40, ఏటుకూరులోని 102, 104, 105, బుండంపాడు గ్రామంలోని 107 నుంచి 110 వరకు పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు నగేష్‌తో కలిసి పరిశీలించారు. కేంద్రాల వద్ద పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని బంధిత అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రస్తుత పరిస్థితులపై విచారించారు. స్థానిక అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో బంగారు పతకాలు



తెనాలిఅర్బన్: జాతీయ స్థాయిలో జరిగిన రెండు ఒలంపియాడ్ పోటీల్లో బోసు రోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌కు చెందిన ఆరుగురికి బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం లభించిందని స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ ఫౌండేషన్ వారు జనవరి నెలలో పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకులు, పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం స్కూల్ ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సారస్వత పరిషత్ సంకలనంలో హకీం కథ



తెనాలి: తెలంగాణ సారస్వత పరిషత్ రూపొందిస్తున్న బాలల కథా సంకలనంలో పట్టణానికి చెందిన బాల సాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని రచన 'నాలుగు గుండిగలు' కథ ఎంపికైంది. పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య ఈ విషయం తెలియజేసినట్టు హకీంజాని సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. బాల రచయితలు, బాల సాహితీవేత్తలు రచించిన కథలతో పరిషత్ రెండు బాలల కథా సంకలనాలను ప్రచురిస్తోందని, ఇందుకోసం రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలోలని రచయితలు 317 కథలు పంపారు. వీటిలో బాలలు రచించిన 31 కథలు, బాలసాహితీవేత్తలు రాసిన 86 కథలు మొత్తం 117 కథలను ఎంపిక చేసినట్టు తెలియజేశారు. బాల సాహిత్యంపై హకీంజాని ఇప్పటివరకు 86 పుస్తకాలు, 282 కథలు రాశారు.

ఫ్యాన్ ప్రభంజనం సృష్టించాలి

- వైఎస్సార్ సీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- ఇంటింటా జోరుగా ఎన్నికల ప్రచారం



ఉప్పరపాలెం సభలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థి అంబటి మురళీకృష్ణకు కసుకర్రు, పెద ఇటికంపాడు, ఉప్పరపాలెం ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. హారతులిచ్చి, పూలతో ఘనస్వాగతం పలికారు. సోమవారం అంబటి మురళీకృష్ణ ఆ గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి విశేష ఆదరణ లభించింది. ఆలయాల్లో అంబటి పూజలు నిర్వహించారు. ఇటికంపాడులో స్థానికులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఇక్కడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, అందిన సంక్షేమాన్ని చూసి మే 13న పోలింగ్ రోజు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, ప్రభంజనం సృష్టించాలని అంబటి మురళీకృష్ణ ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా సాయంత్రం ఉప్పరపాలెంలో జరిగిన సభలో అంబటి మురళీకృష్ణ మాట్లాడారు. ప్రజల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డిపై ఉన్న అభిమానం చూస్తుంటే.. తనకెంతో సంతోషం కలిగిస్తోందన్నారు. ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరిశాయని చెప్పారు. ఇక్కడి ప్రజలు చూపించిన అభిమానం చూసి, వచ్చే ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా గెలుస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. సభకు బొనిగల వేణుప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు అన్నాబత్తుని సదాశివరావు, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్, సర్పంచులు భవనం వంశీరెడ్డి, జాలాది యానాదిరావు, తిరుపతి రాయుడు, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, నాయకులు బొద్దులూరి రంగారావు, షేక్.నాజర్, వడ్రాణం ప్రసాద్, మూకిరి అనిలా కుమారి, అంబటి వెంకటేశ్వరరావు, వట్టిప్రోలు రంగారావు, సయ్యద్ సుభాని, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



కసుకర్రు, పెద ఇటికంపాడులో ఘన స్వాగతం పలికిన ప్రజలు

విద్యే ప్రగతికి మార్గం

ఎమ్మెల్సీ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు రూరల్: విద్యే ప్రగతికి మార్గమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. సోమవారం అమరావతి రోడ్డు నగరాలు నందున్న శారద స్కూల్ 30వ వార్షికోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగం ఎంత తక్కువగా ఉంటే అంత మంచిదన్నారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ 1993 నుంచి స్కూల్ అభివృద్ధిలో తను పాలు పంచుకోవటం సంతోషకరంగా ఉందన్నారు. స్కూల్ చైర్మన్ పి.చలపతిరావు, స్కూల్ డైరెక్టర్ పి.భారతివాణి, మధుసూదన్‌రెడ్డి తదితరులు వేదికపై మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సీటీఎస్ వార్డులో రూ. 60 లక్షలతో వర్క్‌స్టేషన్



వర్క్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్ కుమార్, పక్కన పలువురు వైద్యులు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి కార్డియో థొరాసిక్ సర్జరీ (సీటీఎస్) వార్డు ఆపరేషన్ థియేటర్‌లో ఆధునాతమైన ఎల్ఈడీ లైట్లు, వర్క్ స్టేషన్ రూ. 60 లక్షలతో ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం సీటీఎస్ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లను ఆయన ప్రారంభించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ గతంలో రెండు ఆపరేషన్ థియేటర్లలో వెలుతురూ సరిగా లేకపోవడంతో వైద్యులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. వైద్యుల అవసరాలను గుర్తించి వెంటనే విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనివల్ల శస్త్ర చికిత్సలు చేయడం చాలా తేలికగా ఉండటమే కాకుండా వైద్యులకు ఎలాంటి అలసట లేకుండా ఉంటుందన్నారు. ఆపరేటషన్ థియేటర్‌లో వీడియో మానిటరింగ్ కూడా ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా వైద్య విద్యార్థులు వృత్తి మెలకువలు నేర్చుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రిలో కూడా లేనివిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతమైన లైట్లు ఏర్పాటు చేశామన్నారు. బైపాస్ హార్ట్ సర్జరీలు సుళువుగా చేసేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. రెండు ఆపరేషన్ థియేటర్ అందుబాటులో ఉండటం వల్ల ప్రతిరోజూ రెండు ఆపరేషన్‌లు చేసే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. త్వరలో రెండవ ఆపరేషన్ గదిలో ఫ్లోరింగ్, రూ. 20 లక్షల విలువైన ఆధునిక లైట్లు ఏర్పాటు చేస్తామని, రూ. 80 లక్షల విలువైన టి.ఇ.ఇ స్కాన్ ప్రోబ్ కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. సీటీఎస్ వైద్యులు కుప్ప స్వామి, రామరాజు, పోలయ్య, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, డెప్యూటీ కలెక్టర్ సుధా రాణి, ఏడీ నాగేశ్వర రావు, నర్సింగ్ సూపరింటెండెంట్లు ఆషా సజని, గంగమ్మ పాల్గొన్నారు.

శివనామ స్మరణతో మనసు పవిత్రం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- సంపత్ నగర్ శివాలయంలో ప్రత్యేక పూజలు

పట్నంబజారు: ముల్లోకాల అధిపతి మహాదేవుడు.. ఆయన్ని నిండు మనస్సుతో స్మరిస్తే.. అంతా మంచే జరుగుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గుంటూరు నగరంలోని సంపత్‌నగర్ శివాలయంలో సోమవారం మహారుద్రాభిషేకం పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ ఆదిదేవుడు మహాశివుడు అంటే కల్మషం లేనివాడని, అందుకే ఆయన్ను భోళా శంకరుడు అంటారని, శివనామస్మరణతో మనసు పరిశుద్ధం అవుతుందన్నారు. సర్వేశ్వరుడు ప్రకృతిలోని సత్వ, తమో, రజో గుణాలేవీ అంటనివాడని, అందుకే శివనామస్మరణ చేస్తే మనస్సుల్లోని కల్మషం అంతా పోయి పరిశుద్ధులం అవుతామన్నారు. భస్మం పరిశుభ్రతను.. ముక్కంటి మూడో నేత్రం జ్ఞానానికి సూచిక అని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, గేదెల రమేష్, టింట్ హౌస్ బాబు, గుంటూరు వెస్ట్ సోషల్ మీడియా కన్వీనర్ యద్దనపల్లి బాలరాజు, శ్రీనివాస్ రెడ్డి, బొబ్బిలి శ్రీను, కొమ్మేర రాము, మల్లికార్జున్, ఐటీసీ రవి, వాసు, నందిరాజు మీనాక్షి, గనిక ఝాన్సీ, సుజాత, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

8న భక్తాంజనేయస్వామి తిరునాళ్ల

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులోని గరువుకొండ వద్దనున్న భక్తాంజనేయ స్వామి 14వ తిరునాళ్ల ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయఅభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. అదేరోజు సాయంత్రం తిరునాళ్ల సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. 9వతేదీన ఉగాది పండుగనాడు స్వామివారికి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలను అర్చకులు నిర్వహిస్తారన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు.

30 మద్యం బాటిళ్లు పట్టివేత



పోలీసులు పట్టుకున్న మద్యం సీసాలు

మంగళగిరి: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు వద్ద 30 మద్యం బాటిళ్లను రూరల్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం రూరల్ ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల మేరకు విజయవాడకు చెందిన కె.రవీంద్ర, బీట సాయి, దూది వరుణ్‌కుమార్‌లు కారులో విజయవాడ నుంచి తెనాలి మద్యం బాటిళ్లు తరలిస్తుండగా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీ నిర్వహించి స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పార్శిల్ కార్యాలయాలలో తనిఖీలు..

పట్టణంలో ఆటోనగర్‌లోని పలు పార్శిల్ కార్యాలయాలలో పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు తనిఖీలు నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ పార్శిల్ కార్యాలయాలలో ఏవైనా అనుమానస్పదంగా పార్శిల్ వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏవైనా పెద్ద సంఖ్యలో ఇంటి సామాగ్రి, చీరలు, మిక్సీలు లాంటి పార్శిల్‌లో వస్తే తమ దృష్టికి తీసుకురావాలని పార్శిల్ కార్యాలయాల నిర్వాహకులను ఆదేశించినట్లు తెలిపారు.

చంద్రబాబుది కుల దురహంకార మనస్తత్వం

ఆంధ్రప్రదేశ్ నెడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్



తాడేపల్లిరూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కుల దురహంకార, భూస్వామ్య, నీచ మనస్తత్వం కలిగిన వ్యక్తి అని ఆంధ్రప్రదేశ్ నెడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్ అన్నారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలో ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ చంద్రబాబుకు ఎస్సీ, ఎస్టీలు, నిరుపేదల పట్ల, వివిధ వృత్తులు చేసుకుని గౌరవంగా బ్రతికే శ్రామికుల పట్ల అత్యంత చులకన భావం ఉందని విమర్శించారు. ఉన్నత విద్యాధికుడైన సింగనమల అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎం.వీరాంజనేయులను ఉద్దేశించి టిప్పర్ (లారీ) డ్రైవర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సీటు ఇచ్చారని అత్యంత వ్యంగంగా, హేళనగా మాట్లాడారని తప్పుపట్టారు. వీరాంజనేయులు ఉన్నత విద్యాధికుడని, ఉద్యోగం దొరకకపోవడంతో టిప్పర్ డ్రైవర్‌గా నిజాయితీగా తన కుటుంబాన్ని పోషిస్తూ గౌరవంగా జీవిస్తున్నాడని అన్నారు. చంద్రబాబు నాయుడు దృష్టికలో టిప్పర్ డ్రైవర్లు, కారు డ్రైవర్లు, వివిధ వాహనాల డ్రైవర్లు మనుషులు కారా అని ప్రశ్నిస్తున్నామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల పాలిట ఆత్మబంధువు అని, సామాన్యులను సైతం గెలిపించి పార్లమెంట్‌కు, అసెంబ్లీకి పంపగలరని అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ఎస్సీలలో పుట్టాలని ఎవరు కోరుకుంటారని సభ్య సమాజం సిగ్గుపడే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు.

బకింగ్‌హామ్ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని మోరంపూడి భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా బకింగ్‌హామ్ కెనాల్‌లో మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ మహేంద్ర సోమవారం సంఘటనా స్థలానికి వెళ్లి ముళ్లపొదల్లో ఇరుక్కుపోయి ఎముకలు బయటపడిన మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేంద్ర మాట్లాడుతూ మృతిచెందిన వ్యక్తి వయస్సు 50–60 సంవత్సరాలు ఉండవచ్చని, ఎప్పుడు బకింగ్ హామ్ కెనాల్‌లో కొట్టుకు వచ్చి ముళ్ల పొదల్లో ఇరుక్కుపోయి మృతదేహం కుళ్లిపోయి ఎముకలు బయటపడ్డాయని, మృతుని వంటిపై బ్లూ, ఎరుపు రంగు కలిగిన షర్ట్, బ్లూ కలర్ ఫ్యాంట్ ఉన్నాయని, మోరంపూడి వీఆర్ఓ దేవరపల్లి రత్నకుమారి సమక్షంలో గుర్తుతెలియని మృతదేహంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేంద్ర తెలిపారు.

పోలింగ్ స్టేషన్లలో బోర్డులు ఏర్పాటు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో జరుగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అధికారులు పోలింగ్ బూత్‌లలో అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు సన్నాహాలు ప్రారంభించారు. సోమవారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి 51 పోలింగ్ బూత్‌లలో మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ నెంబరు 87, పార్లమెంట్ నియోజకవర్గ పరిధి 13తో పాటు పోలింగ్ స్టేషన్‌నెంబరు, చిరునామా, బీఎల్ఓ పేరు, ఫోన్ నెంబరు, సూపర్‌వైజర్, పోలీస్ స్టేషన్, సెక్టార్ ఆఫీసర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, వార్డ పేర్లు, ఫోన్ నెంబర్లతో బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని, ఎవరికి ఎటువంటి సందేహాలు వచ్చినా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని వారు తెలిపారు.

జగనన్న మాట ఇస్తే అమలుచేసి చూపెడతారు

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్
- జనసేన, టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి బారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: జగనన్న మాట ఇచ్చారంటే చేసి తీరుతారని, చంద్రబాబు అన్నీ అబద్ధాలే చెప్పి ప్రజలను మోసం చేస్తాడని ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం వికాస్‌నగర్‌లోని ఎమ్మెల్యే అభ్యర్థి క్యాంపు కార్యాలయంలో 40వ డివిజన్ స్వర్ణాంధ్రనగర్‌కు చెందిన 50 మంది యువకులు, కుటుంబాలు టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే అభ్యర్థి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే అభ్యర్థి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం జరగాలంటే జగనన్న ద్వారానే సాధ్యమన్నారు. చంద్రబాబు, దత్తపుత్రుడుని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు.

జగనన్న ద్వారానే ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని నమ్మిప్రజలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో పత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి అఖండ మెజారిటీతో వైఎస్సార్ సీపీని గెలిపించి జగనన్నకు గిఫ్ట్‌గా ఇద్దామని పిలుపునిచ్చారు. జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకునేందుకు బూత్‌స్థాయి నుంచి కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా కృషి చేయాలని కోరారు. జగనన్న ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా పార్టీలో చేరిన కార్యకర్తలు జై జగనన్న, జై కిరణన్న అంటూ నినాదాలు చేశారు. రానున్న ఎన్నికల్లో పత్తిపాడు నియోజకవర్గంలో వైఎసార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా వైస్ ప్రెసిడెంట్ చింతశ్రీదేవి, ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసరావు, కాలనీవాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులున్నారు.

చిరుధాన్యాల ఆహారంతో రుచి, ఆరోగ్యం



చిరుధాన్యాలతో వంటల తయారీని వివరిస్తున్న హైమాకిరణ్

గుంటూరు రూరల్: చిరు ధాన్యాలతో తయారు చేసిన వంటకాలతో రుచి, ఆరోగ్యం కలుగుతుందని చిరు .ధాన్యాల వంటకాల నిపుణులు హైమా కిరణ్ తెలిపారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో చిరుధాన్యాలతో వంటకాల తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచంలో వివిధ రకాల కారణాల వల్ల సాంప్రదాయ ఆహారం చిరుధాన్యాలను పక్కనబెట్టి వరి, గోధుమలు వాటి స్థానం వచ్చి చేరాయన్నారు. చిరుధాన్యాలతో పోల్చుకుంటే వరి, గోధుమల్లో పోషకాలు తక్కువగా ఉంటాయన్నారు. ఆరోగ్యంగా జీవించడానికి అవసరమైన పోషకాలు చిరుధాన్యాల్లోనే సమపాళ్ళలో ఉంటాయని తెలిపారు. చిరుధాన్యాలతో ఇంట్లోనే తయారు చేయగలిగే వంటకాలు మిల్లెట్ కొబ్బరి అన్నం, మిల్లెట్ బిర్యాని, పులిహోర మసాలా, మిల్లెట్ పులిహోర, మిల్లెట్ పొంగల్, మిల్లెట్ ఉప్మా, మిల్లెట్ ఇడ్లీ, మిల్లెట్ దోశ, మిల్లెట్ సూప్ లాంటి వంటకాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అనురాధ, చిరుధాన్యాల నిపుణులు మిల్లెట్ రాంబాబు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెడ్‌ప్లస్‌లో ఉద్యోగాలకు 16 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో ఇటీవల మెడ్ ప్లస్ ఫార్మసీ మార్ట్ నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 16మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన విద్యార్థినుల అభినందన కార్యక్రమంలో ప్రభాకరరావు మాట్లాడుతూ ఔషధ రంగంలో వృత్తి నైపుణ్యం సాధించడం ద్వారా విద్యార్థినులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. విద్యలో చూపిన ప్రతిభతో పాటు విద్యార్థినుల్లోని నైపుణ్యాల ఆధారంగా మెడ్‌ప్లస్ ప్రతినిధులు తమ సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వివరించారు. జీవితంలో త్వరగా స్థిరపడేందుకు పాలిటెక్నిక్ కోర్సులు దోహదం చేస్తాయని, ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ, దూరవిద్య ఇంటర్ చదివిన విద్యార్థినులు పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరవచ్చునని తెలిపారు. గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో విద్యార్థినులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉచిత మజ్జిగ పంపిణీ శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేస్తున్న చలపతి విద్యాసంస్థల సెక్రటరీ సుజిత్ కుమార్

మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల కంప్యూ టర్ సైన్స్ టెక్నో క్రాట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఉచిత మజ్జిగ పంపిణీ శిబిరాన్ని ప్రారంభించారు. అమరావతి – గుంటూరు ప్రధాన రహదారిపై కళాశాల ఎదుట ఉన్న బస్‌స్టాప్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని చలపతి విద్యాసంస్థల కార్యదర్శి వై.సుజిత్ కుమార్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించి ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా సుజిత్ కుమార్ మాట్లాడుతూ వేసవి ఎండల తాపం పెరుగుతున్న నేపధ్యంలో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండాలనే సేవాభావంతో విద్యార్థులు మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకునేలా చేయడం వాలన వారిలో సామాజిక స్పృహను పెంపొందించవచ్చన్నారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ టెక్నోక్రాట్స్ విభాగం విద్యార్థులను ఆయన అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, సీఎస్ఈ విభాగాధిపతి జి.రామచంద్రరావు, పలు విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.